దిక్కులేని పేదపిల్లకు ఎక్కడా దొరకని చక్కెరెట్లా వచ్చిందనుకొంటున్నాడు నాగరాజు. పాల గ్లాసు "ఓవల్‌టిన్" తెచ్చింది రత్నాబాయి. "అయ్యో, ఆలోచిస్తూ కూర్చున్నారా? ఆరిపోతుంది త్వరగా కానీండి" దగ్గర కూర్చుని అంతరొట్టే తినిపించేసింది.

సాయంకాలం ఐదు గంటలు. బడి వదిలి పెట్టారు. అంతా గందరగోళంగా చెప్పుకొంటున్నారు. రత్నాబాయి ఇంట్లో దొంగలుపడ్డారు. ఆరువందల రూపాయలు ఖరీదుచేసే చీరెలు పోయినయ్. ఏ పిల్లవాడి నోటివెంట చూసినా అదే గొడవ.

ఆవూరిలోకి పేరుపడ్డ రెడ్డిగారు, ఆప్రాంతాల్లోకి ధనికుడైన శెట్టిగారి కొడుకు నీవు చేయించావంటె నీవు చేయించావని గొడవ పడుతున్నారు పోలీసు స్టేషనులో. సబ్ ఇనస్పెక్టరుగారు ఆరాతీస్తున్నారు. నాగరాజు అక్కడికి చేరేసరికి, రత్నాబాయి ఇంటికి వచ్చిపోయే వారి లిస్టు పూర్తిచేశారు ఇన్‌స్పెక్టరుగారు. అందులో మొదటిపేరు ప్రక్క గ్రామంలోని ఎలిమెంటరీ స్కూలు హెడ్మాస్టరుగారిది.

"ఈయన ఆపిల్ల తండ్రి" అన్నాడు నాగరాజు.

"అందుకనే మీ పేరు ఇందులో లేదు" అన్నారు ఇన్‌స్పెక్టరుగారు. రామ స్మరణ చేస్తూ నాగరాజు కళ్లు మూసుకొన్నాడు.

మిరపకోత ఐపోయింది. పూలులేని బంతి చెట్లు కంపలాగ నిల్చిఉన్నై. కంది కొడుతున్నారు. నాగరాజు నిరాశగా స్మశానంలో కూర్చుని ఆకాశంలోకి చూస్తున్నాడు.

స్కెచ్

# అనుకోని సంఘటన

అవసరాల రామకృష్ణారావు

"ఏమేవ్!"

ఇలాంటిగావు కేకలు అలవాటయినవే కాబట్టి సుందరమ్మ పెట్టే పోపు చప్పుడులో వినిపించినా పలకలేదు.

"ఇదుగో...నిన్నే..." ఈమారు సుందరమ్మ జవాబు చెప్పక తప్పిందికాదు. కాగుతున్న నూనె దింపేసి వీధిచావిడిలోకి వచ్చింది.

"ఎందుకండీ, అంతంత అరుపులు? ఏంకొంప మునిగిపోయిందీ?"

"ఏమీ లేదే. అబ్బాయి ఉత్తరం రాశాడు!"

"ఏమనీ?"

"అదే చెప్పుకో చూద్దాం!"

"వయసు మళ్లినా మీ హాస్యాలు తగ్గలేదు. ప్రక్కగదిలో అల్లుడూ, కూతురూ ఉన్నారు. వింటే బాగుండదు. మీతో ముచ్చట్లు చెపుతూ కూర్చోడానికి నాకేం తీరిక లేదు. ఏమిటో చెప్తారా, చెప్పరా?"

"చెప్పను."

ఇలాంటి వ్యతిరేక సమాధానం ఆశించక పోవడంవల్ల సుందరమ్మ వెలవెలబోయి, అయినా "మొగుడు బతిమాలడా?" అన్న ఆశ చంపుకో లేక, వంటింటివైపు వెనక్కి చూడకుండా నాలుగడుగులు నడిచి, అలాంటి చిహ్నాలేవీ కనిపించక పోవడంవల్ల వెనక్కి తిరిగి,

"అంతకోపం ఎందుకండీ?" అంది బ్రతిమాలినట్టుగా.

"లేకపోతే ఏమిటీ, ఎంతో మంచి కబురు చెపదామని నే పిలవడమేమిటి. క్షణం తీరిక లేని ఆఫీసర్లా "రంయ్" మని వచ్చి..."

"బాగుందండోయ్, మా ఆడవాళ్ళకు వంటిల్లే ఆఫీసు అప్పడాలే కాగితాలు, పోపుల పెట్టే టైపు రైటరు, తప్పేలా గిన్నెలే సర్వెంట్లు."

సుందరమ్మ మాటలకి ఇద్దరూ పకపక నవ్వుకొన్నారు. సమయానుకూలంగా పురుషులను లోబరుచుకోవడం ఆడదానికి పుట్టుకతోవచ్చిన విద్య. ఈ సదవకాశం పోనియ్యకుండా సుందరమ్మ,

"ఇంతకీ అబ్బాయి ఏంరాశాడో చెప్పేరు కారు" అంది.

"కేవలం ఉత్తరమే కాదు, మనియార్డరు కూడా పంపేడు."

"అదేమిటండోయ్, మొన్న నేగా సొమ్ము కావాలని వ్రాస్తే ఏభై రూపాయిలు పంపేరు!"

"అదే, తిరిగి పంపేశాడు!"

"అదేం? కోపం వచ్చిందా ఏమిటి?"

"శుభం పలకరా పెళ్ళికొడకా అంటే పెళ్ళికూతురుముండ ఎక్కడుందన్నాడట, నీ తరహాకి చెందిన పెళ్ళికుమారుడు."

"మరయితే ఎందుకు పంపినట్టు?"

"ఏముంది, నా చిట్టితండ్రి ప్రయోజకుడయ్యాడు. తన సొమ్ము తనే గడించుకుంటున్నాడు! 'ఇంట్లో ఇబ్బందిగా ఉంటుందని' ఈ సొమ్ము వాడుకోమనీ పంపించేశాడు."

"అయితే, మరి తన జీతమో!"

"అదే గడించుకొన్నాడు, మామూలుగా గణించడం కాదే. సారస్వతగణన!"

"అంటే?"

"అంటే, ఇన్నాళ్ళూ మనవాడు పత్రికలకు కథలు రాస్తున్నాడుగా, వాళ్లు బహుమానంగా కొంతసొమ్ముపంపిస్తామన్నారుట, తెలిసిందా?"

"మన కష్టసుఖాలూ, మంచి చెడ్డలూ బాగా "అవగాహన" చేసుకున్నవాడు కాబట్టి మన వాడు డబ్బు తిరిగి పంపించేశాడుగానీ, మరొకడయితే యీ పాటికి "టకీ, టకీ"మని సొమ్ము ఖర్చు పెట్టెయ్యాడుటండీ, ఏమంటారు?"

* * *

"కాదు మరీ!" అన్నాడు సోమయాజులు.

"ఏమండోయ్, సొమ్ముమాట ఏంచేశారు?" పడక కుర్చీలో కూర్చుని భాగవతం చదువుకుంటున్న సోమయాజులు యీ మాటలు విని, పుస్తకం మూసి వెనక్కి తిరిగేడు.

"ఏ సొమ్ముమాట?"

"అదే, మన అబ్బాయి పంపిన సొమ్ము?"

"ఓహో అదా, ఇంటి ఖర్చుకని వాడు రాశాడుగాని ఒకటోతారీఖునే అన్ని బాకీలూ తీర్చేశాంగా..."

"ఇదుగో యిలా చూడండి, యీ చీరకి ఎంత చిరుగో, కనపడకుండా కొంగు లోపలికి దోపుకొని అవస్థ పడుతున్నాను. రెండు చీరలు కొనుక్కుంటే..."

"ఇంట్లో కూర్చున్న నీకే అంత బాధగా ఉంటే వీధిలోకి వెళ్ళి పదిమందిలో మాట్లాడవలసినవాడిని నాకెలా వుంటుందో ఆలోచించావా? అందుకనే నాలుగు పంచెలు తీసుకుని ఎడ్వాన్సుగా పదిహేను యిచ్చాను."

"మీరూ యిచ్చారూ? ఐతే నేనూ మాట యిచ్చానే!"

"అయ్యయ్యో. ఎవరికీ, నన్నడగకుండానే!"

"ఈ మాత్రానికి అడిగేదేముందండీ. బట్టల వీరమల్లయ్య వీధిలోకి చీరలు తెచ్చాడు. మూడు చీరలు తీసుకున్నాను. మరోటి పుచ్చుకుంటానని మాట యిచ్చాను. చక్కటి కోయంబత్తూరు చీరలు, ఓమారు పోనిస్తే మళ్ళీ దొరకుతాయటండీ? ఇంతకీ యిచ్చింది మాటేగా!"

ఈ మాట విని ప్రక్కగదిలోఉన్న కూతురు అన్నపూర్ణ వచ్చి "మీ అల్లుడూ మాట ఇచ్చారమ్మా, అనక చెప్పలేదనుకు నేరు. ఏదో ఇంటి పట్టున ఉండి యింతో అంతో, చాకిరీ చేస్తున్నారా, ఆమాత్రం స్వతంత్రంలేదా? యింట్లో కష్టమొచ్చినా సుఖమొచ్చినా నలుగురిదీ కాదా అని రెడీమేడ్ షాపులో నాన్న పేరున నాలుగు చొక్కాలు తెచ్చుకున్నారుట!" అంది. ఇంతలో పోస్టుమేన్ వచ్చి ఓ ఉత్తరం యిచ్చాడు. ఉత్తరంలో ఇలా ఉంది.

"నాన్నా, నా కథలు ప్రచురిస్తూన్న పత్రికవాళ్లు, ఇంకొక్క రచయితకి యాభై రూపాయలు ఇచ్చారని తెలిసి నాకుకూడా అలాగే పంపమని వారికి వ్రాశాను. వారు పంపుతారనే దృఢనిశ్చయంతో మీరు పంపిన డబ్బు తిప్పి పంపివేశాను.

కాని ఆ పత్రిక సంపాదకుడు నా కథలలో అంత విలువ లేదనీ ఇలాగే వ్రాస్తూవుంటే మరికొన్నాళ్ళకు ఇవ్వగలమనీ.నన్ను ప్రోత్సాహపరచడానికై ఒక్క అయిదు రూపాయలు మాత్రం పంపారు. ఆ అయిదు రూపాయలైనా వచ్చాయిగదా అన్న సంతోషంలో వాటినిఖర్చు పెట్టటమేకాకుండా మరికొంత అప్పుకూడా చేశాను. దయచేసి వెంటనే 75 రూ. పంపండి. జీతం కట్టడం ఆలస్యమైతే రిజిస్టర్లో పేరు కొట్టేస్తారు. —మధు"